

అందుకా అధికారి ఇలా చెప్పసాగాడు..

''మేమే చెప్పాల్సింది. మీరే అడిగారు కనుక, సంతోషంగా చెబుతాను. ఈ మాళవ దేశాన్ని శ్రీసేనుడనే మహారాజు పాలిస్తున్నాడు. ఆయన చాలా మంచివాడు. కానీ పూర్వకర్మవల్ల పాపం ఆయనకు రాజయక్ష్మ (క్షయ) రోగం పట్టుకుంది. ఎన్ని మందులకూ తగ్గింది కాదు. ఆరుమాసాల కిందట ఒక తాంత్రికుడు ఈ ఊరికి వచ్చాడు. రాజు రోగాన్ని పరీక్షించి, తాను భేతాళ తంత్రంలో ఒక యాగం చేస్తే రాజుగారి రోగం చేత్తో తీసేసినట్లు పోతుందన్నాడు.

కానీ ఆయనకు ఆ యాగం కోసం.. భేతాళవశ్యం చేసిపెట్టేందుకు ఒక మనిషి కావాలి. ఆ మనిషి అత్యంత సాహసవంతుడై ఉండాలి. భయపడేవాణ్ని భేతాళుడు మింగేస్తాడు. అందువల్ల మా రాజ్యంలో సాహసికులం దర్నీ పిలిపించాం. కొందరు ముందే తమవల్ల కాదనేశారు. మరికొందరు ప్రయత్నించి ప్రాణాలమీదికి తెచ్చుకున్నారు. చివరికి మా మంత్రిమండలి సుదీర్ఘంగా ఆలోచించి.. లోకంలో జూదరుల వంటి సాహసికులు ఉండరనే నిర్ణయానికి వచ్చారు. జూదరులు భార్యాపుత్రులను విడిచిపెట్టి, ఇల్లు పట్టకుండా తిరుగుతుంటారు. వారికి భయమనే మాటలేదు. చెట్లకింద పడుకుంటారు. ప్రాణాలకు ఆశపడరు. జూదం కోసం ఎంతకైనా తెగిస్తారు. కనుక, రాజ్యంలో ఉన్న ధూర్త జూదరులందరినీ పోగేస్తే ఫలితం ఉండవచ్చని భావించి ఈ సత్రం కట్టించారు. నన్నిక్కడ నియమించారు'' అని చెప్పి..

''ఇప్పుడు చెప్పండి బాబులూ! మీ ఇద్దరిలో ఎవరైనా ప్రయత్నిస్తారా? ఇందులో నెగ్గితే మీకు అర్ధ రాజ్యం సంక్రమిస్తుంది'' అని అడిగాడు.

ఆ కథ వింటూనే..

''నేను వస్తాను. మీ తాంత్రికుడు ఎక్కడున్నాడో చెప్పండి'' అన్నాడు శ్రీదర్శనుడు.

''మిత్రమా! తొందరపడకు. ఆ భేతాళుడు అనేక వికారాలు ప్రదర్శిస్తాడట. వాడు ఒక్కసారి బొబ్బపెడితే ఎంతటివాడికైనా గుండెనిబ్బరంగా ఉండలేదట'' అని నిరుత్సాహ పరిచాడు ముఖరకుడు.

''ఫరవాలేదయ్యా! ఈ మహారాజుకు జబ్బు నయమైతే, మనకు అర్ధరాజ్యం వస్తుంది. పూర్వం విక్రమార్క మహారాజు ఇటువంటి సాహసం చేసి.. చరిత్రలో నిలిచిపోయాడు. నన్ను కూడా చెయ్యనియ్యి'' అని ముఖరకుడితో చెప్పి సత్రం అధికారివైపు తిరిగి..

''పదండి పోదాం'' అన్నాడు శ్రీదర్శనుడు.

''ఇప్పుడే కాదు.. అమావాస్యకు ముందురోజు'' అని చెప్పాడు సత్రం అధికారి.

మూడోనాటికి బహుళ చతుర్దశి రానేవచ్చింది. శ్రీదర్శనుడు స్నానం చేసి, పట్టువస్త్రాన్ని ధరించాడు. రాత్రి కాగానే కత్తి చేతపట్టుకుని శ్మశాన వాటికకు వెళ్లాడు. పూడ్చిపెట్టిన శవాలను బయటికి లాగి పీక్కుతింటున్న నక్కలను చూస్తూ.. చితినుంచి జారి కిందపడి బిర్రబిగిసిపోయిన కొరివి దయ్యాలను చూస్తూ.. కాలుతూ కాలుతూ పెటేల్మని పేలుతున్న పుర్రెల శకలాలు మీద పడుతుండగా దులపరించుకుంటూ ముందుకు వెళ్లాడు.

అక్కడ తంత్రసాధకుడు కనిపించాడు. ఒంటినిండా బూడిద పూసుకుని ఉన్నాడు. శవాల జుట్టుతో పేనిన యజ్ఞోపవీతాన్ని ధరించాడు. ఒక చెట్టుమొదట హోమానికి అన్నీ సిద్ధం చేసుకుంటున్నాడు.

శ్రీదర్శనుడు అతనికి నమస్కరించి..

''మహాత్మా! నాకు కర్తవ్యం బోధించండి'' అన్నాడు.

తాంత్రికుడు గారపళ్లతో నవ్వాడు.

''మహావీరా! ఇక్కడికి రెండుక్రోసుల దూరం పశ్చిమంగా పోతే ఒక శింశుపా వృక్షం కనిపిస్తుంది. దాని చిగుళ్లు చితాగ్నిచేత మాడిపోయి కనిపిస్తాయి. దానిపై ఒక పీనుగు ఉంటుంది. దానిని నలగకుండా భుజంపై వేసుకుని ఇక్కడికి రావాలి. జడుసుకున్నావంటే ప్రమాదం రాగలదు'' అని గంభీరంగా పలికాడు.

శ్రీదర్శనుడు ఆ సాధకుడు చెప్పిన గుర్తుల ప్రకారం అక్కడికి వెళ్లాడు. పీనుగుకోసం చెట్టెక్కేసరికి రెండోకొసనుంచి వేరొకడు కనిపించాడు. తనకంటే ముందు చెట్టునుంచి పీనుగును దింపబోయాడు. శ్రీదర్శనుడు అడ్డుకున్నాడు. కానీ వాడు ఆ పీనుగును విడిచిపెట్టలేదు.

ఇద్దరికీ గొడవ జరిగింది. ఇంతలో భేతాళుడు పీనుగులో ప్రవేశించి ప్రళయ భయంకరంగా పెడబొబ్బపెట్టాడు. ఆ ధ్వని విని, రెండోవాడికి గుండె పగిలింది. నేలపై కూలిపోయాడు.

శ్రీదర్శనుడు కొద్దిగా కూడా జడవకుండా ఆ శవాన్ని భుజంమీద ఎక్కించుకుని, ముందుకు నడవసాగాడు.

భేతాళుడు అంతలో శ్రీదర్శనుడి భుజంమీది పీనుగులోంచి ఇవతలికి వచ్చి.. అప్పుడే చచ్చిన రెండోవాడిలో ప్రవేశించాడు. శ్రీదర్శనుడికి అడ్డంగా నిలిచాడు.

''నిలువు నిలువు! వీడినెక్కడికి తీసుకుపోతున్నావు. వీడు నాకు మిత్రుడు. వీణ్ని తీసుకుపోనివ్వను'' అన్నాడు.

''కాదు వీడు నాకు మిత్రుడు. నేనే తీసుకుపోతాను'' అన్నాడు శ్రీదర్శనుడు.

''నిదర్శనం చూపగలవా?'' అని ప్రశ్నించాడు చనిపోయినవాడి శరీరంలో ప్రవేశించిన భేతాళుడు.

అప్పుడు శ్రీదర్శనుడు, తన భుజంపై ఉన్న ప్రేతంతో..

''ఓయీ! నువ్వు మా ఇద్దరిలో ఎవరికి మిత్రుడివో నువ్వే చెప్పు'' అని అడిగాడు.

''మీ ఇద్దరిలో ఎవరు నాకు సరిపడేంత ఆహారం ఇవ్వగలరో వారికే నేను మిత్రుణ్ని'' అని చెప్పింది ప్రేతం. అప్పుడు రెండోవాడు..

''నా దగ్గరేమీ లేదు. అతనేమైనా ఇస్తే పుచ్చుకో!'' అన్నాడు.

వెంటనే శ్రీదర్శనుడు..

''ఇదిగో నీకు తగిన ఆహారం ఇస్తున్నాను. తీసుకో!'' అంటూ తన చేతి కరవాలంతో రెండోవాడి శిరస్సు ఖండించబోయాడు. దాంతో అందులోని భేతాళుడు ఇవతలికి వచ్చేశాడు. అంతేకాదు ఆ శవాన్ని కూడా మాయం చేశాడు.

తిరిగి శ్రీదర్శనుడి భుజంమీదనున్న ప్రేతంలో ప్రవేశించి..

''ఏదీ నాకు ఆహారం ఇస్తానన్నావు కదా!'' అని పలికాడు.

అప్పుడు శ్రీదర్శనుడు కరవాలంతో తన శిరస్సునే ఖండించుకోబోయాడు. దాంతో భేతాళుడు ప్రసన్నుడయ్యాడు.

''మహావీరా! నీ సాహసానికి మెచ్చుకుంటున్నాను. నీ దేహం నశించకుండు గాక! నేను నీకు వశుడినయ్యాను. నువ్వు కోరుకున్న చోటికి నన్ను తీసుకుపో. కానీ ఒకమాట చెబుతున్నాను విను. ఆ సాధకుడికి యాగాన్ని పూర్తిచేసే శక్తి లేదు. దానిని కూడా నువ్వే పూర్తిచేయాల్సి ఉంటుంది'' అని పలికాడు.

ఆ మాటలు విని శ్రీదర్శనుడు సంతోషించి, ప్రేతాన్ని మోసుకుంటూ మాంత్రికుని వద్దకు వెళ్లాడు. అక్కడ రక్తంతో అలికి, మానవుల ఎముకల పొడితో చేసిన ముగ్గుకు చుట్టూ నూనె దీపాలు వెలుగుతున్నాయి. వాటి మధ్యలో శ్రీదర్శనుడు తాను తెచ్చిన ప్రేతాన్ని పడుకోబెట్టాడు. దానికి ఎర్రని పూలమాలను వేసి, లేపనాలను పూశాడు. మాంత్రికుడు ఆ ప్రేతం గుండెలమీద కూర్చున్నాడు. భేతాళుణ్ని ఆవాహన చేసి, ప్రేతం నోటిలో ఎముకలతో హోమం చేయసాగాడు.

ఆ సమయంలో ప్రేతం నోటిలోనుంచి పెద్దజ్వాల ఒకటి పైకి లేచింది. సాధకుడు ఆ వేడిని తట్టుకోలేకపోయాడు. చప్పున శవంనుంచి దిగిపోయాడు. వెంటనే శవంలోని భేతాళుడు మహోగ్రంగా నోరుతెరిచి ఆ మాంత్రికుణ్ని యథాతథంగా మింగేశాడు. శ్రీదర్శనుడు ఆ ఉపద్రవాన్ని చూసి, హాహాకారం చేస్తూ..

''ఆ సాధకుణ్ని బయటికి ఉమ్మెయ్. లోపలికి మింగేశావంటే నిన్నిప్పుడే నరికేస్తాను'' అని పలికాడు.

అందుకు భేతాళుడు..

''సాహసవీరా! ఆ సాధకుడు మళ్లీ బతకడం కల్ల. నేను నీ సాహసానికే ప్రీతి చెందాను. ఇప్పుడు నువ్వు నా నోటినుంచి వెలువడుతున్న ఆవాలను తీసుకో. వీటిని నూరి, ఆ రాజు గుండెలకు రాయి. దాంతో అతని రోగం కట్టిపోతుంది'' అని పలికాడు.

శ్రీదర్శనుడు నమస్కరించి..

''భేతాళరుద్రా! అలాగే చేస్తాను. కానీ ఆ రాజ్యప్రజలు నామాట నమ్మకపోతే ఏం చేయాలి?! సాధకుణ్ని నేనే చంపి నాటకమాడుతున్నానంటే నా నిజాయతీని ఎలా నిరూపించుకోగలను?'' అని ప్రశ్నించాడు.

అందుకు శవంలోని భేతాళుడు..

''వాళ్లను ఇక్కడికి తీసుకొచ్చి ఈ శవం కడుపు చీల్చి చూపించు. ఇందులో ఆ మాంత్రికుడి శరీరం యథాతథంగానే నిర్జీవంగా కనిపిస్తుంది'' అని పలికాడు.

శ్రీదర్శనుడు అప్పుడే శోభానగరానికి వెళ్లాడు. అతను అనుకున్నట్లే అందరూ సాధకుణ్ని శ్రీదర్శనుడే చంపాడని అనుమానించారు. వారి అనుమానాన్ని నివృత్తి చేయడంతో పాటు.. శ్రీసేన మహారాజుగారి వ్యాధిని కూడా నయం చేశాడు శ్రీదర్శనుడు.

**(వచ్చేవారం.. విగ్రహం చేసిన పెళ్లి)**